క్లుప్తంగా

అంగన్‌వాడీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు



అంగన్‌వాడీ కార్యకర్తలకు పోలీస్‌స్టేషన్ వద్ద భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: అంగన్‌వాడీ కార్యకర్తలను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సుమారు 101 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు విజయవాడ వెళ్లకుండా అడ్డుకుని పోలీస్టేషన్‌కు తరలించారు. ముందస్తు చర్యల్లో భాగంగా అదుపులోకి తీసుకుని వదిలేశారు. ఉంగుటూరు పోలీస్టేషన్‌కు తీసుకువచ్చిన వారందరికీ పోలీసులు భోజనాలు ఏర్పాటు చేశారు. ఎస్సై మణికుమార్, సీఐ సుభాష్, పోలీసులు భోజనాలు వడ్డించారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు

దెందులూరు: విజయవాడలో భారతదేశం గర్వించదగ్గ విధంగా భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గొల్ల కిరణ్ అన్నారు. సోమవారం మాలమహానాడు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం నాయకులతో కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. దళిత, గిరిజన, మైనార్టీ, బడుగు, బలహీన వర్గాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నటికీ గుర్తుంటారని ఆయన అన్నారు.

క్రీడా పోటీలకు గ్రౌండ్ పరిశీలన



గోపన్నపాలెంలోని ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలను పరిశీలిస్తున్న అధికారులు

దెందులూరు: ఆడుదాం– ఆంధ్ర దెందులూరు నియోజకవర్గస్థాయి ఆటల పోటీలు గోపన్నపాలెం వ్యాయామ విద్య కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీలత, నియోజకవర్గ కోఆర్డినేటర్ రాజ్‌గోపాల్ అన్నారు. సోమవారం వ్యాయామ కళాశాల స్థలాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నత్తానియేలుతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దెందులూరు, పెదపాడు, పెదవేగి, ఏలూరు మండల కోఆర్డినేటర్లు, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలున్నారు. అనంతరం నియోజకవర్గ స్థాయి కోఆర్డినేటర్ రాజగోపాల్ మాట్లాడుతూ నియోజకవర్గ పోటీలకు ఎంపికైన వారు ఆధార్ కార్డు, సచివాలయాలను తీసుకురావాలన్నారు.

ఉన్నతమైన వ్యక్తిత్వం ఉత్తమ భవితకు దోహదం



కైకరం జెడ్పీ హైస్కూల్లో మాట్లాడుతున్న బ్రహ్మకుమారి లావణ్య

ఉంగుటూరు: ఉన్నతమైన వ్యక్తిత్వం ఉత్తమ భవిష్యత్తుకు దోహదం చేస్తుందని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఏలూరు జిల్లా కో–ఆర్డినేటర్ బ్రహ్మకుమారి లావణ్య అన్నారు. ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్ఎం గుళ్ల ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి లావణ్య మాట్లాడుతూ మాట్లాడుతూ జ్ఞాపక శక్తి పెంచుకునేందుకు అవసరమైన మెళకువలు కథల ద్వారా వివరించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి సభ్యులు రామబ్రహ్మం, నరసింహరావు, పేరెంట్స్ కమిటీ సభ్యులు కె.సత్యనారాయణ, సీహెచ్ శ్రీనివాస కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సహకారంతో విజయ కేతనం పుస్తకాలను 10వ తరగతి విద్యార్థులకు అందజేశారు.

యోగా గురువు పోస్టుకు దరఖాస్తు ఆహ్వానం

పెదవేగి : కొప్పాకలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు యోగా శిక్షకురాలి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆసుపత్రి డాక్టర్ ఎల్ శ్రీనివాసరావు తెలిపారు. నెలలో 20 గంటలు పని చేసేందుకు మహిళా శిక్షకురాలు కావాలని, అర్హత డిగ్రీ, పీజీ, డిప్లమో చేసిన అభ్యర్థులు అర్హులని, ఎంపికై అభ్యర్థులకు గంటకు రూ.250 చొప్పున రూ.5 వేలను గౌరవ వేతనంగా ఇస్తామని ఆయన తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు 9848557530 అనే నంబర్‌ను సంప్రదించాలని డాక్టర్ శ్రీనివాస్ కోరారు.

గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ

- రామాలయాల్లో ప్రత్యేక పూజలు
- అయోధ్యలో రాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా వేడుకలు
- ఆలయాల వద్ద ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు



ఉంగుటూరు: నారాయణపురం టూరింగుపేట రామాలయం వద్ద పూజలు



గణపవరం: శ్రీరాముని శోభాయాత్రలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు



భీమడోలు: పోలసానిపల్లి నుంచి భీమడోలుకు శోభాయాత్ర



భీమడోలు: శ్రీరాముని చిత్రపటాలకు పూజలు చేస్తున్న భక్తులు

దెందులూరు: ప్రతి భారతీయుడు గర్వించేలా అయోధ్యలో నిర్మించిన రామ మందిరంలోని బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం మండలంలో అన్ని గ్రామాల్లో ప్రజలు ఎల్ఈడీలు, టీవీల్లో తిలకించారు. ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్ని రామాలయాల్లో రామ స్మరణతో మార్మోగాయి. దెందులూరు, గోపన్నపాలెంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఇంద్రవనంలోని రామాలయంలో పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్లలో ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గ్రామస్తులతో కలిసి తిలకించారు. ఎమ్మెల్యే వెంట విజయవాడ కనకదుర్గమ్మవారి ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేద కుమారి, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, జిల్లా కమిటీ సభ్యులు పోకల రాంబాబు, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, జిల్లా కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరిరాజు, నాయకులు గొరిపర్తి శ్రీనివాసరావు, మొటపర్తి రాంబాబు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

పెదపాడు: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని సోమవారం అన్ని హిందూ దేవాలయాల్లో, గృహాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం రామ నామస్మరణ చేస్తూ దీపాలను వెలిగించారు. రామమందిర కమిటీ ఆదేశాల మేరకు అప్పనవీడులోని అభయాంజనేయస్వామి దేవాలయంలో, పెదపాడులోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో, గండి చెరువు గట్టులోని రాములవారి ఆలయంలో, ప్రత్యేక పూజలు చేసారు. అప్పనవీడు సెంటర్‌లో కోలాట నృత్య ప్రదర్శన ఏర్పాటు చేసారు. ఈకార్యక్రమంలో రామ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంతా రామ మయం

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో రాములోరి కల్యాణాలు, ఊరేగింపుతో అంతా రామ మయమైంది. సోమవారం గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఉంగుటూరులో విద్యార్థుల ర్యాలీ నిర్వహించారు. కోనేరుపేట మహిళలు రాములోరి శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచి బండారు సింధు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ పత్సమట్ల ధర్మరాజు, భీమేశ్వరాలయ మాజీ చైర్మన్ నారాయణహనుమంతురావు, బీజేపీ నాయకుడు కొరిపల్లి అప్పారావు, పిళ్ళా రామకృష్ణ, బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అడపా శోభారాణి ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ్రెడ్డి సర్వేశ్వరరావు భక్తులు పాల్గొన్నారు. నారాయణపురంలో టూరింగుపేట రామాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మరడ రమావతి, మంగరావు దంపతులు పాల్గొన్నారు. నారాయణపురం కమ్మవారి రామాలయంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శరణాల మాలతీరాణి అప్పారావు దంపతులు పాల్గొని కల్యాణం నిర్వహించారు. కైకరంలో విజ్ఞాన భారతి పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

గ్రామాల్లో శ్రీరాముని శోభాయాత్ర

గణపవరం: అయోధ్యలో రామమందిర విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా గ్రామాలు జై శ్రీరామ్ నినాదాలతో మార్మోగాయి. గణపవరం మండలంలోని గ్రామాల్లో భక్తులు జెండాలు చేతపట్టి, మేళతాళాలు, బాణసంచా కాల్పులతో రామనామస్మరణ చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు. రామాలయాల వద్ద ప్రత్యేక పూజలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు దీపారాధనలు చేశారు. భక్తులకు పానకాలు పంపిణీ చేశారు. పిప్పరలో కొలనువాడ సుబ్బరాజు ఆధ్వర్యంలో శ్రీరాముని శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ ఇందుకూరి రామకృష్ణంరాజు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. గణపవరం బస్టాండు వద్ద సలాది వారి వీధిలో రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఋవ్వనపల్లిలో కృష్ణుడి ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు.

ధర్మానికి ప్రతీక శ్రీరాముడు

భీమడోలు: ధర్మానికి ప్రతీక శ్రీరాముడని, అలాంటి శ్రీరామ జన్మభూమిలో ఆలయ నిర్మాణం, బాల రాముని విగ్రహాన్ని ప్రతిష్ఠించడం శుభ సూచికమని జిల్లా గాయత్రి సేవా సమితి ప్రధాన కార్యదర్శి కాశీభొట్ల నాగ వెంకట పార్వతీశ్వరశర్మ అన్నారు. అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం మండల వ్యాప్తంగా శ్రీరాముని ఆలయాలు శ్రీరామ నామ స్మరణతో మారుమోగాయి. ర్యాలీలు, భజనలు, ప్రదర్శనలు, శోభాయాత్రలు నిర్వహించారు. పోలసానిపల్లి నుంచి భీమడోలు వరకు రామ భక్తులు శోభాయాత్రను నిర్వహించారు. భీమడోలు వేంకటేశ్వర స్వామి రూపక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుండుగొలనులో సీతారామ స్వామి ఆలయ ట్రస్టీ కొండ గంగారాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయంలో విశేష పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీహనుమద్ వాహనంపై శ్రీస్వామి వారి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. భీమడోలులోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలను పంపిణీ చేసారు. భీమడోలు రావిచెట్టు వద్ద గల రామాలయంలో రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తులు స్క్రీన్‌పై తిలకించి పులకరించిపోయారు. వడ్లపట్లలోని రామాలయంలో రాత్రి భారీ అన్న సమాధానం నిర్వహించారు. రామాలయాల్లో మహిళలు దీపాలు వెలిగించారు.

పుంతలో ముసలమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



పుంతలో ముసలమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నిడమర్రు: బావాయిపాలెంలో వేంచేసియున్న పుంతలో ముసలమ్మవారి జాతర ముగింపు సందర్భంగా సోమవారం ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈనెల 16 నుంచి 22వ తేదీ వరకూ ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. గణపవరం, ఋవ్వనపల్లి, సరిపల్లె, బావాయిపాలెం, క్రొవ్విడి, పెదకాపవరం, చినకాపవరం, సిద్ధాపురం, చానమిల్లి, ఎనికేపల్లి, అడవికొలను, నిడమర్రు తదితర గ్రామాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారి మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం ఆలయం వద్ద అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను వేలం వేస్తామని కమిటీ అధ్యక్షుడు ముత్యాల పెదబాబు తెలిపారు.

సమస్యలపై వినతుల స్వీకరణ



దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సోమవారం తన కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. స్వయం ఉపాధి, అభివృద్ధి పనులు, వ్యక్తిగత అవసరాలు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై ఏలూరు, దెందులూరు మండలాల ప్రజలు ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు.పరిష్కార నిమిత్తం సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సిఫార్సు చేశారు. గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, వార్డు మెంబర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులున్నారు.

జాతీయ స్థాయిలో భీమడోలుకు గుర్తింపు ప్రశంసనీయం



భీమడోలులో సర్పంచ్ పాము సునీత,మాన్‌సింగ్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు, అధికారులు

భీమడోలు: జాతీయ స్థాయిలో భీమడోలు గ్రామ పంచాయతీకి గుర్తింపు తెచ్చిన సర్పంచ్ పాము సునీత మాన్‌సింగ్ సేవలను ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆరోగ్యవంతమైన గ్రామం అనే అంశంపై తిరుపతిలో నిర్వహించిన జాతీయ సదస్సులో భీమడోలు గ్రామ పంచాయతీకి అరుదైన గౌరవం లభించింది. ఈ నేపథ్యంలో భీమడోలు పంచాయతీ వద్ద సోమవారం వద్ద సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ దంపతులకు పౌర సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సోదరుడు పుప్పాల కార్తీక్, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలన్నింటినీ గ్రామంలో అమలు చేయడంలో ప్రత్యేక కృషి చేసిన సర్పంచ్ సేవలను వారు కొనియాడారు. పంచాయతీలో చేపట్టిన ఆరోగ్య సేవలపై లఘు చిత్రాన్ని రూపొందించి జాతీయస్థాయిలో ప్రదర్శించడంతో ఇతర రాష్ట్రాల ప్రతినిధులు సైతం రాష్ట్రంలోని పథకాలను ప్రశంసిస్తూ వాటిని సమర్థవంతంగా గ్రామంలో నిర్వహిస్తున్న సర్పంచ్ సేవలను అభినందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. జాతీయ స్థాయిలో భీమడోలుకు ప్రత్యేక గుర్తింపు రావడం మరవలేని ఘట్టమన్నారు. ఇదే స్ఫూర్తితో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించాలని నాయకులు కోరారు. సన్మాన గ్రహీత పాము సునీతామాన్‌సింగ్ మాట్లాడుతూ డీపీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, గ్రామ కార్యదర్శి నందేటి ఠాగూర్, సంబంధిత అధికారుల సహకారాలు మరువలేనివన్నారు. భీమడోలు పంచాయతీ తన హయాంలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కండ్రిగనరసింహపురం సర్పంచ్ మెండెం సంతోష్‌కుమార్, మండల సాగు సలహా మండలి చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు మద్దాల అప్పారావు, నాయకులు సుతాపల్లి ప్రసాద్, అంబటి నాగేంద్ర ప్రసాద్, రామిశెట్టి శ్రీను, సొసైటీ డైరెక్టర్ కిలపర్తి భాస్కరరావు, సచివాలయ ఉద్యోగులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితా ప్రకటన



పూళ్లలో ఓటర్ల జాబితాలను ప్రచురిస్తున్న బీఎల్‌వోలు

భీమడోలు: 2024 ఓటర్ల తుది జాబితాను ఎన్నికల కమిషన్ సోమవారం ప్రకటించింది. ఓటర్ల జాబితాలను బూత్ స్థాయి అధికారులు సంబంధిత పంచాయతీ కార్యాలయాలు, పోలింగ్ కేంద్రాల వద్ద ప్రదర్శించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాల సవరణలు, మార్పుల కోసం ఈనెల 12వ తేదీ వరకు అవకాశం కల్పించింది. మండలంలోని 53 పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించి ఓటర్ల నమోదు, మార్పులు, సవరణలు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులను బీఎల్‌వోలు స్వీకరించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ తుది ఓటర్ల జాబితాలను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో మండలంలోని 53 పోలింగ్ కేంద్రాల్లో 52,518 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 25,611, స్త్రీలు 26,907 మంది, పురుష ఓటర్లలో సర్వీసుల ఓటర్లుగా 51 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు.

మహిళా ఓటర్లు అధికం

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో 2024 తుది జాబితా ప్రకారం 2,82,777 ఓట్లు నమోదయ్యాయని ఈఆర్వో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ అన్నారు. సోమవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారని అన్నారు. 1,14,305 మంది మహిళా ఓటర్లు, 1,08,465 పురుష ఓటర్లు, ఇతరులు ఏడుగురు ఉన్నారు. నాలుగు మండలాల్లో 239 పోలింగ్ బూత్‌లు ఉండగా, 239 మంది బూత్ లెవెల్ ఆఫీసర్లు ఎన్నికల బాధ్యతలు నిర్వహించనున్నారని తెలిపారు. తుది జాబితాను నియోజకవర్గంలో అన్ని పోలింగ్ బూత్‌లకు అందరి బీఎల్‌ఓల వద్ద వెబ్‌సైట్‌లో ఉంచామని ఈఆర్వో సత్యనారాయణ, ఏఈఆర్‌ఓ నాంచారయ్య అన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగేశ్వరరావు ఉన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు రూపొందించండి



శిక్షణ తరగతిలో మాట్లాడుతున్న అధికారులు

ఏలూరు రూరల్: గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులపై ముందుగానే గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని ఎంపీడీఓ బి.ప్రణవి ఆదేశించారు. సోమవారం ఏలూరు రూరల్ మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచ్, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు గ్రామ పంచాయతీ సాధారణ పరిపాలన, ఆర్థిక వ్యవహారాల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు.

ఈ సందర్భంగా ప్రణవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు 2024 – 25 ఏడాది అభివృద్ధి పనులపై ముందుగానే గ్రామ సభ నిర్వహించాలన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించి, ఫొటోలతో ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఈ ప్రణాళికలపై మండల స్థాయి అధికారులు సమీక్ష చేసి ఆమోదిస్తారని తెలిపారు. ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రభుత్వాలు విడుదల చేసిన నిధులు ముందస్తు ప్రణాళికతోనే ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. వార్షిక నిధులు, పంచాయతీ జనరల్ ఫండ్, ఉపాధి పథకం నిధులతో చేపట్టబోయే పనులపై ప్రజలతో చర్చించి ప్రణాళిక రూపొందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి, ఎంఏఓ జీవనసంధ్య, ఎంఈఓ రంగయ్య, ఏపీఓ కిషోర్, సర్పంచ్‌లు పత్యాల సునీత, డి.భాగ్యశ్రీ, కార్యదర్శులు రవీంద్ర, ప్రసాద్, సుమలత, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎన్ని పార్టీలు కలిసొచ్చినా జగన్‌ను గెలిపించుకుంటాం

భీమడోలు: తెలంగాణలో రాజకీయ పార్టీ పెట్టి.. అక్కడ నమ్ముకున్న కార్యకర్తలను వదిలేసి వచ్చిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఏపీలో స్వలాభం కోసమే రాజకీయం చేసేందుకు వచ్చారని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ విమర్శించారు. ఇదంతా ప్రజలు గమనిస్తూనే ఉన్నారని సోమవారం ఆయన పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 16 నెలలపాటు అక్రమంగా అన్యాయంగా జైలులో పెట్టించిన కాంగ్రెస్ పార్టీలో చేరి.. ఆయన పైనే అక్కసు వెళ్లగక్కడం దారుణమని పేర్కొన్నారు. జగన్ అంటే జనమని, ఏపీలో జగన్ ప్రభంజనమే నడుస్తోందని తెలిపారు. ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా జగన్‌ను గెలిపించుకుంటామని, అంతిమ విజయం వైఎస్సార్ సీపీదేనని ఆయన పేర్కొన్నారు.

దంతాల సంరక్షణతో సంపూర్ణ ఆరోగ్యం



దంత వైద్య కళాశాలలో ఉచిత సేవలను ప్రారంభించిన కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్

పెదవేగి : దంతాల ఆరోగ్యాన్ని కాపాడుకుంటే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి. మోజెస్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాలలోని సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాలలో సోమవారం ప్రోస్టోడోంటిక్స్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ కృత్రిమ దంతాల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోస్టోడోంటిక్స్ విభాగం డాక్టర్ కె. సీతారామ్ ప్రసాద్ మాట్లాడుతూ దంత వైద్య చికిత్సలన్నీ ఉచితంగా అందించనున్నామని ఆయన చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ మాట్లాడుతూ ప్రపంచ కృత్రిమ దంతాల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రోస్టోడోంటిక్స్ విభాగం ఆధ్వర్యంలో పదిరోజులపాటు దంతవైద్య చికిత్సలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా దంతవైద్య విద్యార్థులకు ముగ్గుల పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.స్లీవరాజు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన గంగా భవాని, భార్గవి, వాణితో ప్రిన్సిపల్ ఎస్. నత్తానియేలు

దెందులూరు: ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో ఇటీవల నిర్వహించిన 10 కేఎం క్రాస్ కంట్రీ పోటీల్లో ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిన గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల విద్యార్థినులు వీ. గంగాభవాని, బీ.వాణి, జీ.భార్గవి వచ్చేనెల 10, 11 తేదీల్లో మహారాష్ట్రలోని స్వామి వివేకానంద యూనివర్సిటీలో నిర్వహించనున్న ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం కళాశాలలో విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నత్తానియేలు అభినందించారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పు



పెదనిండ్రకొలనులో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ కోడే కాశి

నిడమర్రు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రభుత్వ విద్యలో విప్లవాత్మక మార్పులతో ప్రతి పేద విద్యార్థికి కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నారని జెడ్పీటీసీ కోడే కాశి అన్నారు. సోమవారం పెదనిండ్రకొలను జెడ్పీ స్కూల్లో 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్ ట్యాబ్‌ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కోడే కాశి మాట్లాడుతూ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన సీఎంగా జగన్ చరిత్రలో నిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముగ్గళ్ల యాకోబు, హెచ్ఎం టీవీ సత్యనారాయణ తదితరులున్నారు.

విజయకేతనం పుస్తకాల పంపిణీ



విజయకేతనం పుస్తకాలతో ఉపాధ్యాయులు

ఏలూరు రూరల్: ప్రత్యేక ప్రణాళిక, శ్రద్ధతో చదివితే ప్రతి విద్యార్థి 10వ తరగతి ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణులవుతారని మాదేపల్లి జెడ్పీ పాఠశాల హెచ్ఎం సుంకర వెంకటలక్ష్మి అన్నారు. సోమవారం ప్రభుత్వం 10వ తరగతి విద్యార్థులకు విజయకేతనం గైడ్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు మాట్లాడుతూ రోజువారీ నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం విజయకేతనం పుస్తకం చదివి టెస్టులు రాయడం వల్ల మెరుగైన ఫలితాలను సాధించవచ్చన్నారు. పరీక్షలపై ఆందోళన, భయం ఉన్న బాలబాలికలకు ఈ పుస్తకం ఒక ధైర్యంగా ఉంటుందని చెప్పారు. ఉపాధ్యాయులు ఎస్ శివశంకర్, ఎస్ ఉషశ్రీ, దుర్గ, ఎం అపర్ణ, వెంకటేశ్వరమ్మ, కామాక్షి, యాస్మిన్ పాల్గొన్నారు.

నేడు కొత్తముప్పర్రులో ప్రజా ఆశీర్వాద యాత్ర

పెదపాడు: కొత్తముప్పర్రులో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి రెండో రోజు ప్రజా ఆశీర్వాద యాత్ర ప్రారంభమవుతుందని పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్ తెలిపారు. పెదపాడు మండలంలోని కొత్తముప్పర్రు నుంచి పాతముప్పర్రు, బాగినీడుపాకలు, వీరమ్మకుంట మీదుగా వెంకటాపురం, రామచంద్రపురం వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు.